క్లుప్తంగా

అంగన్‌వాడీ చిన్నారులకు బ్యాగుల వితరణ



బ్యాగులు పంపిణీ చేస్తున్న స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు

మెంటాడ(గజపతినగరం రూరల్): మండలంలోని తుమ్మికాపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు గజపతినగ రానికి చెందిన స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళ వారం బ్యాగులు, కుర్చీలు, వాటర్‌బాటిళ్లు పంపిణీ చేశారు. ఆ ఫౌండేషన్ అధ్యక్షుడు సాయికుమార్, సభ్యులు తాతినాయుడు, రాము నాయుడు, ఆశిక్, మహిళా పోలీస్ రేణుక, అంగన్‌వాడీ సహాయకురాలు రాధ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆశ్రమ పాఠశాల వార్షికోత్సవం



జ్యోతిరావు పూలే దంపతుల జీవిత చరిత్రను విద్యార్థులకు వివరిస్తున్న ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌పాత్రో

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామ సమీపంలోని జ్యోతిరావుపూలే బాలికల ఆశ్రమ పాఠశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ యు.విజయ్‌కుమార్‌పాత్రో, ఉపాధ్యాయి సిబ్బంది జ్యోతిరావు పూలే, ఆయన భార్య సావిత్రీబాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతిరావుపూలే జీవిత చరిత్రను విద్యార్థులకు ప్రిన్సిపాల్ వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖ నం, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

అగ్నిప్రమాద బాధితులకు సహాయం



బాధితులకు నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేస్తున్న స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు

బొండపల్లి: మండలంలోని గొల్లుపాలెం గ్రామంలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో ఇళ్లు దగ్ధమై సర్వం కోల్పోయిన అయిదు కుటుంబాలకు సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ మంగళవారం సహాయం అందజేసింది. నెలరోజులకు సరిపడా నిత్యావసర సరుకులతో పాటు, దుస్తులు అందజేశారు. ఆ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయికుమార్, సాయిరేవంత్, సభ్యులు నాయుడు, రాయు నాయుడు, ఆశిక్,శివ, తొత్తడ సత్యం, వైఎస్సార్‌సీపీ నాయకులు టి.సత్తిబాబు, గొల్లు సతీష్, పి.కన్నంనాయుడు, కె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కోసం సిమెంట్ బెంచీల ఏర్పాటు



సిమెంట్ బెంచీలను ప్రారంభిస్తున్న ఎంపీటీసీ ఈశ్వరరావు తదితరులు

చీపురుపల్లిరూరల్: మెట్టపల్లి గ్రామంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో భక్తుల కోసం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు రాపర్తి గురుమూర్తి తన తండ్రి సత్యం జ్ఞాపకార్థం రూ.30 వేల విలువైన సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. వీటిని ఎంపీటీసీ మీసాల ఈశ్వరరావుతో కలిసి మంగళవారం ప్రారంభించారు. దాతను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో రాపర్తి సూర్యకుమార్, నాగులపల్లి కృష్ణమూర్తి, శివస్వాములు పాల్గొన్నారు.

నష్టం వాటిల్లితే సమాచారం అందించండి

దత్తిరాజేరు: తుపాను ప్రభావంతో మండలంలో ఎక్కడైనా నష్టం వాటిల్లితే వెంటనే సమాచారం అందించా లని వీఆర్‌ఓలను తహసీల్దార్ రమేష్ మంగళవారం ఓ ప్రకటనలో ఆదేశించారు. వర్షాలకు ఎక్కడైనా మిద్దె, పూరిళ్లు, పశువుల శాలలు కూలిపోతే తహసీల్దార్ కార్యాలయానికి సమాచారం అందించాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన చోట ప్రజలకు సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి

గజపతినగరం: తుపాను ప్రభావం వల్ల చంపావతి నదీ పరివాహక ప్రాంతాల సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీ ల్దార్ ఎం.అరుణకుమారి సూచించారు. మంగళవారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో నదీ పరివాహక ప్రాంతాలైన గజపతినగరం,ఎం.వెంకటాపురం, బూడిపేట, మర్రివలస, పత్రువాడ తదితర గ్రామాల ప్రజలు ఎవరూ నదిలో దిగడం చేయవద్దని సూచించారు.

భారీ వర్షం

- కొత్తవలస మండలంలో 6.8 సెంటీమీటర్ల వర్షం
- లక్కవరపుకోట మండలంలో 4.6 సెంటీ మీటర్లు నమోదు
- తడిసిన వరి చేను,కుప్పలు



లక్కవరపుకోట :రేగలో ఈదురు గాలులకు నేలకొరిగిన వరి చేను



కొత్తవలస: గనిశెట్టిపాలెంలో నేలకొరిగిన పంట వరిచేను



లక్కవరపుకోట: కళ్లేపల్లి గ్రామంలోని పొలాల్లో వరి కుప్పల చుట్టూ చేరిన వరదనీరు



లక్కవరపుకోట: కళ్లేపల్లి గ్రామంలో నీట మునిగిన వరి పంటను రక్షించుకునే ప్రయత్నంలో అన్నదాత



వేపాడ: వేపాడలో కురుస్తున్న వర్షం



కొత్తవలస: సీతంపేట సమీపంలోని పొలాల్లో వరికుప్పల చుట్టూ చేరిన నీరు



గజపతినగరం: మధుపాడలో వరికుప్పలు వేస్తున్న రైతులు

కొత్తవలస/లక్కవరపుకోట: మిచాంగ్ తుపాను నేపథ్యంలో కొత్తవలస, ఎల్.కోట మండలాల్లో సోమవారం రాత్రి, మంగళవారం కుండపోత వర్షం కురిసింది. కొత్తవలస మండలంలో 6.8 సెంటీమీటర్లు, ఎల్.కోట మండలంలో 4.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారు లు తెలిపారు. పొలాల్లో వరి కుప్పలు చుట్టూ వరద నీరు చేరడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కొత్తవలస మండలంలో తుపా ను కారణంగా సుమారు 48 ఎకరాల్లో వరి పంట నీటి మునిగింది. దెందేరు, గనిశెట్టి పాలెం, సంతపాలెం తదితర గ్రామాల్లో ఇంకా కోతలు పూర్తి కాని వరి చేను ఈదురు గాలులకు నేలకొరిగింది. ఎల్.కోట మండలం లోని కళ్లేపల్లి, రేగ, లచ్చింపేట, తామరా పల్లి, గొల్జాం, కళ్లెంపూడి, సీతారామపురం, శ్రీరాంపురం, రెల్లిగౌరమ్మపేట తదితర గ్రామాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. కళ్లేపల్లిలో నీటమునిగిన పంటను కాపాడుకునేందుకు అన్నదాతలు కష్టాలు పడుతున్నారు. మినుము,పెసర పంటలకు కూడా అపార నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

వేపాడలో 40.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

వేపాడ: మండలంలో మిచాంగ్ తుపాను ప్రభావంతో మండలంలో మంగళవారం 40.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. ఉదయం చిరుజల్లులు కురవగా, మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం 11 గంటలకు 5.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా మధ్యాహ్నం 3 గంటలకు 24.8 మిల్లీ మీటర్లు, సాయంత్రం 5 గంటల సమయానికి మొత్తంగా 40.8 మిల్లీ మీటర్లు నమోదు అయ్యింది. పొలాల్లో వరి కుప్పల చుట్టూ చేరిన నీటిని రైతులు గట్లు తెగ్గొట్టి బయటకు పంపిస్తున్నారు. వర్షం మరింత ఎక్కువైతే వరి కుప్పలు పూర్తిగా నీటిలో మునిగిపోతాయని, నష్టం తప్పదని రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

గజపతినగరం మండలంలో..

గజపతినగరం: మండలంలో గజపతినగరం,పురిటిపెంట,ఎం.వెంకటాపురం,దావాలపేట,మదుపాడ తదితర గ్రామాల్లో మంగళవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఇప్పటికే పొలాల్లో వేసిన వరి గాలి కుప్పలు తడిసిపోకుండా వర్షం తెరిపిచ్చిన సమయాల్లో నీరు చేరని ప్రాంతాలకు తరలించి పెద్దకుప్పలుగా పెట్టే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

జనవరిలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి



లబ్ధిదారులతో సమావేశమైన పీఏసీఎస్ చైర్మన్ రమణ, వైస్ ఎంపీపీ సరోజిని

బొండపల్లి: జగనన్న లేఅవుట్లతో పాటు సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలను జనవరి నెలాఖరులోగా పూర్తిచేయాలని గొట్లాం పీఏసీఎస్ చైర్మన్ మహంతి రమణ, వైస్ ఎంపీపీ మీసాల సరోజిని లబ్ధిదారులకు సూచించారు. స్థానిక సచివాలయంలో గృహ లబ్ధిదారులతో మంగళవారం సమా వేశం నిర్వహించారు. ఈసందర్భం గా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుందని అన్నారు. నిర్మాణాలకు అవసరమైన సిమెంట్, ఇసుకను ప్రభుత్వం రాయితీపై అందిస్తోందని, ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తోందని చెప్పారు. అలాగే స్వయం సహాయ క సంఘాల్లో ఉన్న లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా ఇళ్ల నిర్మాణానికి రూ.50 వేల వరకు రుణం అందించడానికి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సర్పంచ్ మండా ఆదిలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నూతన భూహక్కు చట్టాన్ని ఉపసంహరించుకోవాలి



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

శృంగవరపుకోట: రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త భూహక్కు చట్టాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని ఎస్.కోట బార్ అసోసియేషన్ న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఎస్.కోట మున్సిఫ్ మెజిస్ట్రేట్‌కోర్టు న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించి కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అల్లు సత్యాజీ, డబ్ల్యూ.ఎస్.శర్మ మాట్లాడుతూ ఈచట్టంతో స్థానిక కోర్టులకు విచారణ పరిధి లేకుండా చేశారన్నారు. కేవలం టైటలింగ్ అధికారులకే అధికారం ఇవ్వడం వల్ల వీరిపై రాజకీయ జోక్యం పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఇందుకు సంబంధించిన వాజ్యాలను హైకోర్టులో అప్పీలు చేసుకునే అవకాశం లేక పేద రైతులు ఇబ్బందులు పడతారన్నారు. ప్రభుత్వానికి రైతాంగ సమస్యలు, భూ సమస్యలు సత్వరం పరిష్కరించే యోచన ఉంటే కోర్టులు పెంచి, ఉద్యోగుల సంఖ్య పెంచి కేసులు పరిష్కరించాలని సూచించారు. న్యాయవాదులు జి.సూరిదేముడు, జి.ప్రకాశ్, బి.రామకృష్ణ, బి.త్రిమూర్తులు, జి.చిట్టిబాబు, బి.సత్యనారాయణ, ఆర్.సత్యనారాయణ, బి.వెంకటరావు, పిడిది రామకృష్ణ, బి.శివశేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలకు అవగాహన



రాజకీయ పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శాంతి

చీపురుపల్లి: ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల నిర్వహణ, నియమావళి తదితర అంశాలపై రాజకీయ పార్టీలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆర్డీఓ బి.శాంతి అన్నారు.స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీలతో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించడంలో రాజకీయ పార్టీల సహకారం ఉండాలనే సదుద్దేశంతోనే ప్రతీవారం ఎన్నికల కమిషన్ రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తోందన్నారు. ఇప్పటికే తప్పులు లేని పటిష్టమైన ఓటర్ల జాబితా విడుదల చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఎన్నికలు జరిగేంత వరకు ప్రతీ మంగళవారం రాజకీయ పార్టీలతో సమావే శాలు ఉంటాయన్నారు. ఎన్నికల కమిషన్ నుంచి వచ్చే ప్రతీ సమాచారం అన్ని రాజకీయ పార్టీలకు అందిస్తామని చెప్పారు. అలాగే రాజకీయ పార్టీల నుంచి వచ్చే సూచనలు, సలహాలు ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. చీపురుపల్లి, గరివిడి తహసీల్దార్‌లు ఎం.సురేష్, టి.గోవింద రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ వర్ధంతి

గజపతినగరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ వర్ధంతిని స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బూడి వెంకటరావు, జెడ్పీటీసీ గార తవుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య హాజరై అంబేడ్కర్‌కు నివాళులర్పించ నున్నారని, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు అంతా హాజరు కావాలని కోరారు.

అర్హులంతా ఓటరుగా నమోదు కావాలి

గజపతినగరం: 18 ఏళ్లు నిండిన వారంతా ఓటుహక్కుకు దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సతీష్‌కుమార్ మంగళవారం ఓ ప్రక టనలో సూచించారు. ఇప్పటికే మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల నమోదుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించామని పేర్కొన్నారు. త్వరలో బీఎల్‌ఓలు ఇంటింట సందర్శన చేస్తారని, ఇంకా ఓటు హక్కుకు నమోదు చేసుకోని వారు ఉంటే వారికి దరఖాస్తులు అందజేయాలని సూచించారు. అలాగే మార్పులు, చేర్పులు చేసుకోవాలనుకునేవారు, ఏమైనా సందేహం ఉన్న వారు బీఎల్‌ఓలను సంప్రదిస్తే సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు.

ప్రారంభానికి సిద్ధం



బొద్దాం గ్రామ సచివాలయ భవనం

వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామ సచివాలయ నూతన భవనం ప్రారంభానికి సిద్ధమైంది. ఈ భవనాన్ని రూ.40 లక్షలతో నిర్మించామని ఆ గ్రామ ఉపసర్పంచ్ వెంకటరమణ తెలిపారు. ప్రస్తుతం పెయింటింగ్,టైల్స్ ఏర్పాటు పనులు జరుగు తున్నాయని, త్వరగా పనులు పూర్తి చేసి ఈనెలాఖరులోగా భవనాన్ని ప్రారంభిం చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఉపసర్పంచ్ చెప్పారు.

రైతులకు ఇబ్బందులు తలెత్తకూడదు

- తుపాను నేపథ్యంలో రైతులను అప్రమత్తం చేయాలి
- మిల్లులకు ధాన్యం తరలించేందుకు చర్యలు తీసుకోండి
- అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



బొండపల్లి: అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య



మెంటాడ(గజపతినగరం రూరల్): గజపతినగరం మండల అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే అప్పలనరసయ్య

బొండపల్లి: మిచాంగ్ తుపాను నేపథ్యంలో నియోజకవర్గంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని చర్యలూ తీసుకోవాలని, రైతుల ను అప్రమత్తం చేయాలని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తుపానుపై వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి నూర్పులు పూర్తయిన చోట ధా న్యాన్ని నేరుగా ఆఫ్‌లైన్‌లో మిల్లులకు చేర్చేలా అధికారులు బాధ్యత తీసుకోవా లని చెప్పారు. సివిల్ సప్లయ్ అధికారులతో పాటు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా తుపాను తీవ్రత తగ్గిన తర్వాత ధాన్యం సేకరణకు సంబంధించిన అన్ని ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వ ర్షాల వల్ల ధాన్యంలో తేమశాతం ఎక్కువ ఉండే అవకాశం ఉందని, మిల్లర్లతో మాట్లాడి రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా ధాన్యం కొనుగోళ్లు సక్రమం గా జరిగేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ జేడీఏ వి.టి.రామరావుకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు అవసరమైన వారికి సహాయం అందించాలని ఆదేశించారు.

డీపట్టా భూములకు అర్హులను గుర్తించండి

2003 సంవత్సరానికి ముందు నుంచి డీపట్టా, అసైన్డ్ భూములు సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం శాశ్వత భూపట్టాలను అందజేస్తోందని ఎమ్మెల్యే అప్పల నరసయ్య తెలిపారు. డీపట్టా, అసైన్డ్ భూములు సాగు చేస్తూ ఇంకా శాశ్వత పట్టాలు పొందని వారి వివరాలను గ్రామాల వారీగా సేకరించి నివేదిక అందజేయాలని తహసీల్దార్ డి.జి.ఎం.ఎన్ .ప్రసాదరావును ఆదేశించారు. ఎంపీపీ చల్లా చలం నాయుడు, ఏడీఏ కె.మహరాజన్, ఎంపీడీఓ వై.వి.రాజేంద్ర ప్రసాద్, ఏఓ మల్లికార్జునరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు బి.జగదీశ్వరరావు, కె.వెంకటరమణ,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గొడౌన్లకు తరలించే ఏర్పాట్లు చేయండి

మెంటాడ(గజపతినగరం రూరల్): వరి నూర్పులు పూర్తయిన చోట ధాన్యాన్ని వర్షాలకు తడిసిపోకుండా గొడౌన్లకు తరలించే ఏర్పాట్లు చేయాలని మండల అధి కారులను ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆదేశించారు. తుపాను నేపథ్యంలో గజపతినగరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కుప్పలు తడిసిపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి, రైతులను అప్రమత్తం చేయాలని సూచించారు. ముంపు ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలకు తగిన సహాయక చర్యలు చేపట్టాలని చెప్పారు. తహసీల్దార్ అరుణ, ఏఓ ధనలక్ష్మి, నాయకులు మండల సురేష్, బూడి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల ఆర్థికాభివృద్ధికి ఊతం



సంక్షేమపథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సరయు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రవికుమార్

జామి: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అన్నివర్గాల ఆర్థికాభివృద్ధికి ఊతమిస్తున్నాయని జెడ్పీటీసీ గొర్లె సరయు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొర్లె రవికుమార్ అన్నారు. మండలంలోని వెన్నె గ్రామంలో 'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు ముందుగా గ్రామసచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ సరయు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ పార్టీలకతీతంగా పథకాలు అందజేస్తున్నామన్నారు. పింఛన్ డబ్బుల కోసం గత టీడీపీ ప్రభుత్వంలో అవ్వా తాతలు నానా అవస్థలు పడాల్సివచ్చేదని గుర్తుచేశారు. నేడు ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయాన్నే వలంటీర్లు తలుపుతట్టి పింఛన్ అందజేస్తున్నారని చెప్పారు. రూపాయి అవినీతికి తావులేకుండా, సిఫార్సులతో పని లేకుండా పారదర్శకంగా పథకాలు మంజూరు చేస్తున్నామని అన్నారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలం తా ఆశీర్వదించాలని కోరారు. రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ చలుమూరి సత్యారావు, మండల జేసీఎస్ కన్వీనర్ శీరెడ్డి చందు నాయుడు, ఎంపీటీసీ ఆర్.సత్యం, పలుగ్రామాల సర్పంచ్ లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములపై సంపూర్ణ హక్కు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



నిరుపేదలకు సంపూర్ణ భూహక్కు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అప్పలనాయుడు

పూసపాటిరేగ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదలకు అసైన్డ్ భూములుపై సంపూర్ణ హక్కులు కల్పిస్తూ పట్టాలు మంజూరు చేయడం దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రోల్‌మోడల్‌గా చెప్పవచ్చునని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న సంపూర్ణ భూహక్కు పథకంలో భాగంగా 16 గ్రామాలకు చెందిన 363 మంది లబ్ధిదారులకు 198.23 సెంట్లు భూమికి సంబంధించి పట్టాలు మంగళ వారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు శాశ్వత భూ యాజమాన్య హక్కు పత్రాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేత నిర్ణయంతో నిరుపేద రైతులకు భూహక్కు పత్రాలతో ఎంతో మేలు జరగడంతో పాటు ఆయా కుటుంబాలు కష్టాలు తీరుతాయన్నారు. గతంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి నిరుపేద రైతులకు డీ పట్టాలు మంజూరు చేస్తే నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ భూములుపై సర్వహక్కులు కల్పిస్తూ పట్టాలు అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎన్.సత్యనారాయణరాజు, ప్రజాప్రతినిధులు మహంతి జనార్ధనరావు, బర్రి చినఅప్పన్న, మొంగం నాగ బాబు, గుజ్జు సురేస్‌రెడ్డి, తహసీల్దార్ ఇ.భాస్కరరావు, ఎంపీడీఓ ఎం.రాధిక, డిప్యూటీ తహసీల్దార్ పి.లావణ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధురి తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



మాట్లాడుతున్న భూసార పరీక్ష కేంద్రం ఎ.డి. భానులత

పూసపాటిరేగ(నెల్లిమర్ల) : రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి భూసారాన్ని పెంపొందించుకోవాలని భూసార పరీక్ష కేంద్రం సహాయ సంచాలకులు బి.భానులత అన్నారు. మండలంలోని సీతారామునిపేటలో ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా రైతులకు అవగాహన సదస్సు మంగళ వారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువులు విచక్షణా రహితంగా వాడకం చేయడం వలన భూమి సారం ఏవిధంగా కోల్పోతుందో అవగాహన కల్పించారు. పంట దిగుబడి తగ్గడం, చీడపీడలకు ఎలా కారణభూతమవుతున్నాయో వివరించారు. భూసార పరీక్షల వలన ఉపయోగాలు, సేంద్రియ ఎరువులు వాడకం, పచ్చిరొట్ట ఎరువులు వాడకం వలన ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో భూసార పరీక్ష కేంద్రం ఏఓ ఎం.సింహాచలం, విస్తరణాధికారి జగన్నాధరావు, వ్యవసాయ శాఖ సహాయకులు శ్యాం కుమార్, యాదవ్‌తో పాటు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

వనిత వాకర్స్ క్లబ్‌కు ఉత్తమ అవార్డు

విజయనగరం: పట్టణానికి చెందిన వనిత వాకర్స్ క్లబ్, ఫోర్టు శాఖకు ఉత్తమ క్లబ్ అవార్డు లభించింది. ఈ మేరకు వాకర్స్ డిప్యూటీ గవర్నర్ ముళ్ళపూడి సుభద్ర దేవి మంగళ వారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయం తెలిపారు. క్లబ్ అధ్యక్షురాలు సాయి సంతోషిణి ఉత్తమ యువ అధ్యక్షురాలుగా అవార్డు అందుకున్నారని తెలిపారు. ఈ అవార్డును సోమవారం జరిగిన వాకర్స్ డిస్ట్రిక్ట్ సర్వసభ్య సమావేశంలో గవర్నర్ సత్యం చేతుల మీదుగా అందుకున్నట్టు పేర్కొన్నారు. వనిత వాకర్స్ క్లబ్‌కు ఉత్తమ క్లబ్ అవార్డు లభించడం పట్ల పట్టణంలోని పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.